క్లుప్తంగా

నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడుదాం



మాట్లాడుతున్న డాక్టర్ రాజేందర్

ముస్తాబాద్: నేల తల్లి ఆరోగ్యం కాపాడినప్పుడే కల్తీ లేని ఆహారం అందుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ రాజేందర్, డాక్టర్ చిరంజీవి అన్నారు. మద్దికుంటలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అంశంపై రైతులకు అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. సేంద్రియ విధానంతో పెస్టిసైడ్స్‌కు చరమ గీతం పాడాలన్నారు. అప్పుడే రైతులు, ఆహారం తీసుకున్న ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, డైరెక్టర్ కదిరె సత్తయ్యగౌడ్, మండల వ్యవసాయాధికారి దుర్గారాజు, ఏఈవోలు అనూష, నరేశ్, సౌమ్య, నిఖిల, రైతులు పాల్గొన్నారు.

అమ్మ భాషలో మెలకువలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శైలజ

ముస్తాబాద్: అమ్మ భాషలో మాధుర్యం, గొప్పతనంతోనే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారని తెలుగు ఉపాధ్యాయురాలు శైలజ అన్నారు. ముస్తాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరంలో గురువారం తెలుగుపై అవగాహన కల్పించారు. ఎంఈవో రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కవితా పఠనం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న బడేసాబ్

ఎల్లారెడ్డిపేట: రాచర్ల తిమ్మాపూర్ గ్రామ పరిధిలోని బాకూర్‌పల్లికి చెందిన యువ కవి కట్ల శ్రీనివాస్ తెలుగు భాషా చైతన్య సమితి వారు గురువారం హైదరాబాద్‌లోని త్యాగరాజ గానసభలో నిర్వహించిన సమితి 12వ వార్షికోత్సవ సభలో పాల్గొని కవితా పఠనం చేశారు. సభలో శ్రీనివాస్ చేసిన కవితా పఠనం ఆకట్టుకుంది. శ్రీనివాస్‌ను చైతన్య సమితి అధ్యక్షులు బడేసాబ్, సమన్వయకర్త డాక్టర్ జయప్రకాశ్ ప్రశంసాపత్రం, శాలువాతో ఘనంగా సత్కరించారు.

సమ్మర్ క్యాంపు సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న మండల విద్యాధికారి

వీర్నపల్లి: విద్యార్థులు వేసవికాల సెలవులను సమ్మర్ క్యాంపు ద్వారా సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి తుమ్మ శ్రీనివాస్ అన్నారు. గురువారం గర్జనపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును సందర్శించారు. క్యాంపులో స్పోకెన్ ఇంగ్లిష్, వేదిక్ మ్యాథ్స్, డాన్స్, చెస్, యోగా, డ్రాయింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.


రైతు విశిష్ట సంఖ్య రిజిస్ట్రేషన్ కార్యక్రమం

ఇల్లంతకుంట: వల్లంపట్ల రైతు వేదికలో గురువారం రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యకు రిజిస్ట్రేషన్ కార్యక్రమం చేపట్టారు. రిజిస్ట్రేషన్ నమోదు చేస్తున్న ఏఈవో రవళి మాట్లాడుతూ.. ప్రతి రైతుకు 11 అంకెల విశిష్ట గుర్తింపు కార్డు కేంద్ర ప్రభుత్వం కేటాయించాలని నిర్ణయించిందని, ఈ సంఖ్యతో కేంద్ర ప్రభుత్వ పథకాలు అనుసంధానం చేస్తారన్నారు.

రైతు కుటుంబానికి సెస్ సాయం

ముస్తాబాద్: పొలంలో విద్యుదాఘాతానికి గురై రైతు మృతిచెందగా.. కుటుంబానికి సెస్ సాయం చేసి ఆదుకుంది. చిప్పలపల్లికి చెందిన నిమ్మల ప్రభాకర్ ఆరు నెలల క్రితం పొలంలో పని చేస్తుండగా విద్యుదాఘాతంతో మృతిచెందాడు. బాధిత రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు చేసిన విజ్ఞప్తి మేరకు రూ.5లక్షల పరిహారాన్ని గురువారం అందజేశారు. సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి చేతుల మీదుగా ప్రభాకర్ కుటుంబ సభ్యులకు చెక్కును అందించారు.

ఉన్నతంగా రాణించాలి



ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని కష్టపడి చదువుతూ ఉన్నతంగా రాణించాలని ఎస్పీ మహేశ్ బి గితే అన్నారు. రాచర్ల బొప్పాపూర్‌లోని జ్ఞానదీప్ పాఠశాల విద్యార్థులను గురువారం ఎస్పీ, మండల విద్యాధికారి కృష్ణహరి అభినందించారు. పాఠశాలకు చెందిన 32 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించడం గొప్ప విషయమన్నారు. పాఠశాల కరస్పాండెంట్ మిట్టపల్లి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



ఇది ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని టేకులపల్లి చెరువులోకి వచ్చే కాల్వ. ఈ కాల్వలో చెట్లు, ముళ్లపొదలు పెరిగి నీటికి అడ్డుగా మారాయి. కాల్వ నీరు చెరువులోకి వచ్చే మార్గంలో పూడిక తీయకపోవడంతో పాలేటి వాగు ద్వారా మానేరు వాగులో కలుస్తున్నాయి. దీంతో చెరువులోకి నీరు చేరడం లేదు. ఫలితంగా ప్రస్తుతం చెరువు ఎండిపోయింది. ప్రస్తుతం నీరు వాగులోకి వెళ్తుండడంతో వానాకాలంలో పంటల సాగుపై రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఇతడు ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన టేకులపల్లి చెరువు ఆయకట్టు రైతు మోతె మధుసూదన్‌రెడ్డి. చెరువు కింద 4 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. మరో నెల రోజుల్లో తుకాలు పోసేందుకు సిద్ధమవుతున్నాడు. ఇదే సమయంలో చెరువులోకి వచ్చే నీరు కాల్వలు తీయక వాగులోకి వెళ్తుండడంతో పంటల సాగుపై ఆందోళన చెందుతున్నాడు. నీళ్లు చెరువులోకి రాకపోతే పరిస్థితి ఏమిటని అయోమయానికి గురవుతున్నాడు.

కాల్వ పారదు.. చెరువు నిండదు

- కాల్వల్లో పూడిక తీయక చెరువులోకి రాని నీరు
- వృథాగా మానేరు వాగులో కలుస్తున్న వైనం
- వానాకాలం సాగుపై రైతుల ఆందోళన
- ఉపాధిహామీ పథకంలో సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు
- ఏడాదిగా పూడికతీత పనులకు బ్రేక్

ఎల్లారెడ్డిపేట: వానాకాలం సాగుపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం చెరువుల్లో సంతృప్తికరంగా నీరు లేకపోవడం.. చెరువులోకి నీరు వచ్చే కాల్వలు అధ్వానంగా మారడంతో వచ్చే సీజన్‌లో పంటల సాగుపై అయోమయం నెలకొంది. ఏటా వానాకాలం ముందు ఉపాధిహామీలో చెరువుల్లోకి వచ్చే కాల్వలు, తూం కింది కాల్వల్లో పూడిక తీసేవారు. కానీ ప్రస్తుతం ఆ పనులు చేపట్టడం లేదు. దీంతో చెరువుల్లోకి వచ్చే నీరు వృథాగా వాగులు, వంకల్లో కలుస్తోంది. నీళ్లు లేక చెరువులు ఎండిపోతుండడంతో రైతులు వానాకాలం సాగుపై ఆందోళన చెందుతున్నారు.

టేకులపల్లి ఆయకట్టు 300 ఎకరాలు

నారాయణపూర్‌లోని టేకులపల్లి చెరువు కింద 300 ఎకరాల ఆయకట్టు ఉంది. ఏటా రెండు సీజన్లలో రైతులు పంటలు సాగు చేస్తారు. అయితే ఈ యాసంగి సీజన్‌లో టేకులపల్లి చెరువులో తక్కువ నీరు ఉండడంతో సగం ఆయకట్టుకే తైబంధీ పెట్టుకొని పంటలు సాగు చేసుకున్నారు. వర్షాకాలంలోనైనా పూర్తి ఆయకట్టు భూముల్లో పంటలు సాగు చేసుకోవాలని రైతులు ఎదురుచూస్తున్నారు. అయితే టేకులపల్లి చెరువులోకి వచ్చే కాల్వల్లో ముళ్లపొదలు పెరగడంతోపాటు పూడిక నిండిపోవడంతో ప్రస్తుతం వస్తున్న నీరు వృథాగా మానేరు వాగులోకి వెళ్తోంది. దీంతో చెరువులోకి నీరు చేరడం లేదు.

ఉపాధి పనులపై సందిగ్ధం

జిల్లావ్యాప్తంగా ఉపాధిహామీలో కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టడం లేదు. నారాయణపూర్ గ్రామంలో గతంలో పని చేసిన ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ మరణించగా.. ఆయన స్థానంలో ఎవరిని నియమించలేదు. దీంతో ఆ గ్రామంలో ఉపాధిహామీ పనులు సరిగా చేయడం లేదు. బండలింగంపల్లి, సింగారం, అక్కపల్లి గ్రామాల్లో ఫీడర్ చానల్ పనులు కొనసాగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. టేకులపల్లి చెరువు ఫీడర్ చానల్ పనులు, సింగసముద్రం పరిధిలోని బొప్పాపూర్ గ్రామ ఆయకట్టుకు సంబంధించిన 3 కాల్వల్లో పూడికతీత పనులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.



పాలేటి వాగు ద్వారా మానేరు వాగులో కలుస్తున్న నీరు

నీళ్లు వస్తలేవు



టేకులపల్లి చెరువులోకి నీరు రావడం లేదు. ఫీడర్ చానల్ పనులు చేయక చాలా రోజులవుతోంది. కాల్వలో పారుతున్న నీరు చెరువులోకి రాకుండా నేరుగా వాగులోకి వెళ్తోంది. ఇట్లా అయితే వర్షాకాలం సాగు కష్టమే.

– సూర భాస్కర్, టేకులపల్లి చెరువు ఆయకట్టు రైతు, నారాయణపూర్

నిధులు మంజూరు కాగానే పనులు చేస్తాం



సింగసముద్రం ఆయకట్టు కాల్వల్లో పూడికతీత పనులు, టేకులపల్లి చెరువు ఫీడర్ చానల్ పనులకు ప్రతిపాదనలు వచ్చాయి. వీటికి సంబంధించిన నిధులు ప్రభుత్వం మంజూరు చేయగానే పనులు చేయిస్తాం. కొన్ని కాలువల పనులు కొనసాగుతున్నాయి. ఉపాధిహామీ పథకంలో సాగునీటి కాలువల్లో పేరుకుపోయిన పూడికను కూలీలతో తీయిస్తాం.

– కొమురయ్య, ఏపీవో, ఎల్లారెడ్డిపేట

ప్రతిపాదనలు పంపాం

సింగసముద్రం చెరువు ఆయకట్టు పరిధిలోని మూడు కాల్వల్లో పూడికతీత పనులకు ప్రతిపాదనలు పంపాం. మిగతా కాల్వలు బాగానే ఉన్నాయి. ఉపాధిహామీ పథకంలో భాగంగా పూడికతీత పనులు చేయాల్సి ఉంది. ఈ సీజన్ వరకు చెరువులకు అనుసంధానంగా ఉన్న అన్ని సాగునీటి కాలువలను శుభ్రం చేయిస్తాం.

– సత్యనారాయణ, డీఈ



ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ప్రైవేట్ వ్యక్తులు తమ ద్విచక్ర వాహనాలను నిలుపుతున్నారు. ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించాల్సిన ప్రాంతాల్లో వాహనాలు నిలిపి ఉండడంతో.. వారు రోడ్డుపై బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. వాహనాల పార్కింగ్‌కు బస్టాండ్ అడ్డాగా మారిందని ప్రయాణికులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బస్టాండ్ ఆవరణలో రెండు వైపుల ద్విచక్ర వాహనాలను అనుమతులు లేకుండా రోజులు, గంటల తరబడి పార్కింగ్ చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
కిషన్‌రావు, డీఎం, సిరిసిల్ల, సెల్ నంబర్: 9959225929

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

న్యాయం చేయాలని పెట్రోల్ డబ్బాతో ఆందోళన



ఆందోళన చేస్తున్న వట్టిమల్ల తండావాసులు

వేములవాడరూరల్: తమకు న్యాయం చేయలని కోరుతూ వట్టిమల్ల తండావాసులు వేములవాడ ఫారెస్ట్ కార్యాలయం వద్ద పెట్రోల్ డబ్బాతో గురువారం ఆందోళన చేపట్టారు. ఎఫ్ఆర్‌వో కలీలొద్దీన్ వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం వట్టిమల్లతండాకు చెందిన భూక్య రాజు ట్రాక్టర్‌తో ఫారెస్ట్ ప్రాంతంలో సాగు చేస్తుండగా గురువారం పట్టుకున్నారు. అదే తండాకు చెందిన లకావత్ ప్రశాంత్, ఇషావత్ తిరుపతి ఫారెస్టు అధికారులకు సమాచారమివ్వడంతోనే తన ట్రాక్టర్‌ను పట్టుకున్నారంటూ, దీనికి కారణం మీరేనంటూ భూక్య రాజు తమను చంపుతానని బెదిరిస్తున్నాడంటూ వారు ఫారెస్టు కార్యాలయం వద్దకు వచ్చి న్యాయం చేయాలని పెట్రోల్ డబ్బాతో ఆందోళనకు దిగారు. ఈ విషయంపై ఫారెస్టు అధికారి మాట్లాడుతూ.. మాకున్న సమాచారం మేరకే ట్రాక్టర్‌ను పట్టుకున్నామని, మాకు ఎవరూ ఎలాంటి సమాచారమివ్వలేదని తెలిపారు.

నేరాల నియంత్రణే లక్ష్యం



రికార్డులు పరిశీలిస్తున్న సీఐ మొగిలి

ముస్తాబాద్: నేరాల నియంత్రణే పోలీసుల లక్ష్యమని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి అన్నారు. గురువారం ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులు, విచారణ అంశాలను పరిశీలించారు. ప్రతి కానిస్టేబుల్ విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేయాలన్నారు. ఎస్సై చిందం గణేశ్, పీఎస్సై శ్రీనివాస్ ఉన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

తంగళ్లపల్లి: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని తంగళ్లపల్లి ట్రెయినీ ఎస్సై కె.వినీతారెడ్డి అన్నారు. గురువారం రాత్రి మండల కేంద్రంలోని సిద్దిపేట–సిరిసిల్ల ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ, డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించి పలువురికి జరిమానా విధించారు. ఏఎస్సై చంద్రమౌళి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనికి బయలుదేరిన మహిళలు



వీర్నపల్లి: మండల కేంద్రంతోపాటు మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో కాల్వలు, చెరువులు, హరితహారం, ఫీడల్ చానల్, నర్సరీలు, ఇంకుడు గుంతలు, భూఅభివృద్ధి పనులు, మట్టి రహదారుల నిర్మాణం, శ్మశాన వాటికలు, డంపింగ్ యార్డులు, కంపోస్టు షెడ్డు నిర్మాణం తదితర పనుల్లో మహిళలు పురుషుల కంటే ఎక్కువగా భాగస్వాములయ్యారు. మండల కేంద్రం నుంచి గురువారం ఉపాధిహామీకి పెద్దఎత్తున మహిళలు ఒకేసారి బయలుదేరడంతో చూసేవారు ఆశ్చర్యపోయారు. ప్రతిరోజు మండలంలో పెద్ద సంఖ్యలో మహిళలే ఉపాధి పనిలో పాలుపంచుకుంటున్నారు. ఏపీవోను వివరణ కోరగా.. ప్రతిరోజు మండలంలో మహిళలు 1,200 మంది వరకు పని చేస్తున్నారన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



గోపాలరావుపల్లెలో చెక్కులు అందిస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: గోపాలరావుపల్లె గ్రామంలో గురువారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. అంబటి లస్మవ్వకు రూ.60వేలు, మునిగె మహేందర్‌కు రూ.55వేలు, మల్లయ్యకు రూ.11వేలు అందించారు. నాయకులు కదారి సునీల్ రెడ్డి, కూతురి రాజు, కొండవేణి కిషన్, రవి, మిరాల శ్రీనివాస్‌యాదవ్, ఎడ్ల ప్రేమ్‌కుమార్, జంగం సత్తయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సుజాతపై చర్యలు తీసుకోండి



సీపీకి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ శ్రేణులు

కరీంనగర్‌టౌన్/ఎల్లారెడ్డిపేట: దేశాన్ని, సైనికుల సాహసాన్ని కించపరుస్తూ ఆపరేషన్ సిందూర్‌ను ఎగతాళి చేసేలా సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు, శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాతపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి గురువారం పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంకు ఫిర్యాదు చేశారు. తక్షణమే ఆమెను సస్పెండ్ చేసి, రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, లేకుంటే భారత సైనిక శౌర్యపరాక్రమాలను కించపరిచేందుకు అర్బన్ నక్సలైట్లకు అనుమతిచ్చినట్టే అవుతుందని పేర్కొన్నారు. మాజీ మేయర్ సునీల్ రావు, బాస సత్యనారాయణరావు తదితరులు ఉన్నారు. అలాగే సుజాతపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ మహిళ మోర్చా ఎల్లారెడ్డిపేట మండల నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధ్యక్షురాలు దాసరి పూర్ణిమ, జిల్లా కార్యదర్శి స్రవంతి, నాయకులు పాల్గొన్నారు.

ముగ్గురి రిమాండ్

ఎల్లారెడ్డిపేట: రాచర్లబొప్పాపూర్‌కు చెందిన గడ్డి నరేందర్ ఆత్మహత్య ఘటనకు కారణమైన ముగ్గురిని అదనపు ఎస్పీ శేషాద్రినిరెడ్డి ఆధ్వర్యంలో రిమాండ్‌కు తరలించారు. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాలు.. నరేందర్ బలవంతంగా ఆత్మహత్య చేసుకోవడానికి కారకులుగా ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేయగా, ఇటీవల ఇద్దరిని అరెస్ట్ చేశారు. మరో ముగ్గురు కొత్త నర్సయ్య, కొత్త ప్రసాద్, నీరటి రాజు పరారీలో ఉండగా వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

రక్తదానం

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో రూప్ కుమార్–సుమలతల ఐదు రోజుల బేబీకి ప్లేట్లెట్స్ అత్యవసరమయ్యాయి. గురువారం సిరిసిల్ల వాత్సల్య ఫౌండేషన్ సభ్యుడు నెట్లుట్ల రాహుల్ బి–పాజిటివ్ ప్లేట్లెట్స్ డొనేట్ చేశారు.

సైన్యానికి సంపూర్ణ మద్దతు



వేములవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

వేములవాడ: భారత సైన్యానికి అడ్వకేట్లు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నారని, టెర్రరిజాన్ని పూర్తిగా ధ్వంసం చేసేందుకు ప్రతీ భారతీయుడు సిద్ధంగా ఉండాలని వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండ రవి అన్నారు. ఆపరేషన్ సిందూర్ సక్సెస్ కావడంతో భారత సైన్యానికి మద్దతుగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు పట్టణంలోని తెలంగాణచౌక్ నుంచి బద్దిపోచమ్మ, భీమన్న గుడి, అంబేడ్కర్ చౌరస్తా, రాజన్న గుడి, ప్రధాన రోడ్డు, అమరవీరుల స్తూపం, మూలవాగు బ్రిడ్జి మీదుగా తిప్పాపూర్ తెలంగాణ తల్లి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, అడ్వకేట్లు నేరెళ్ల తిరుమల్‌గౌడ్, కిషోర్‌రావు, పురుషోత్తం, పాత్తూరి అనిల్, రేగుల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై బీజేపీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలో మండల శాఖ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. హిందూ ఏక్తా యాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. ఓబీసీ జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేశ్ మాట్లాడారు. పడాల గణేశ్, బోయిని రాజు, మీసాల రవీందర్, గడ్డం రవీందర్, పెద్ది శ్రావణ్, పడాల నరేశ్, బొబ్బిలి గణేశ్, గోలి రవీందర్, కంటె నరేశ్, మంచే రవీందర్, బోయ శ్రావణ్, మ్యాకల ఫణీంద్ర, పడాల వినయ్, బొబ్బిలి జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: ఆపరేషన్ సిందూర్‌కు మద్దతు తెలియజేస్తూ వరదవెల్లి గురు దత్తాత్రేయస్వామి ఆలయంలో గురువారం బీజేపీ మండల నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. సారంపల్లి రాజు, జనగం లక్ష్మణ్, ఇల్లెందుల బాలయ్య, ఆవుల లక్ష్మణ్ తదితరులున్నారు.

ఆలయ అభివృద్ధి నివేదికలపై సీక్రెటెందుకు?



మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారావు

వేములవాడ: వేములవాడ అంటేనే ప్రసిద్ధి చెందిన రాజన్న ఆలయమని, ప్రస్తుత ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆలయం మూసివేసి అభివృద్ధి చేస్తానంటే భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయని, దైవ సేవలో వ్యక్తిగత అభిప్రాయాల కన్నా ఆగమశాస్త్రం వారి సలహాలతో ప్లాన్ చేయాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు సూచించారు. గురువారం తన నివాసంలో మాట్లాడారు. ఆలయ విస్తరణ అంశాన్ని సీక్రెట్‌గా పెట్టాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. జూన్ 15న ఆలయాన్ని మూసివేస్తామని ప్రకటన ఎంతవరకు సమంజసమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాజన్న సన్నిధికి వచ్చి రూ.76 కోట్లతో అభివృద్ధి చేస్తామని శిలాఫలకం వేసి ఆరు నెలలు గడచినా ఒక్క రూపాయి అయినా వీటీడీఏకు డిపాజిట్ చేశారా అని ప్రశ్నించారు. ఆలయ ఇంజినీర్లను కాదని ఆర్ అండ్‌బీ శాఖతో పనులు చేయించడంలో ఆంతర్యం ఏమిటన్నారు. మొండిగా వ్యవహరించకుండా ఆలోచించి పనులు చేయాలని సూచించారు. సమావేశంలో నాయకులు రాఘవరెడ్డి, రామతీర్థపు రాజు, క్రాంతికుమార్, రామ్మోహన్, సిరిగిరి చందు, గోలి మహేశ్, జోగిని శంకర్, ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

ముస్తాబాద్: రోడ్డుపై అడ్డంగా ఉన్న కోతులను తప్పించబోయిన ఓ వాహన చోదకుడు అదుపుతప్పి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. నిమ్మవారిపల్లెకు చెందిన నిమ్మల అంజయ్య(45) గురువారం పోతుగల్‌కు బైక్‌పై బయల్దేరాడు. పోతుగల్ శివారులో రహదారిపై కోతుల గుంపు ఉండడంతో వాటిని తప్పించబోయి కింద పడ్డాడు. గాయపడ్డ అంజయ్యను 108 వాహనంలో సిద్దిపేటకు తరలించారు. ఒక కాలు, చేయి విరిగినట్లు గ్రామస్తులు తెలిపారు.

కేటీఆర్ సేన మండల అధ్యక్షుడిగా భాస్కర్‌గౌడ్

తంగళ్లపల్లి: బీఆర్ఎస్ పార్టీ కేటీఆర్ సేన తంగళ్లపల్లి మండల అధ్యక్షుడిగా నందగిరి భాస్కర్‌గౌడ్, సోషల్ మీడియా అధ్యక్షుడిగా పిట్ల విన్నుబాబు నియామకమయ్యారు.

ఆధ్యాత్మికం

కుంకుమ పూజలు



ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో ప్రతి ఏటా గురువారం వచ్చే ఏకాదశిని పురస్కరించుకొని మహిళలు కుంకుమ పూజలు చేశారు.

పోలేరమ్మ బోనాలు

కోనరావుపేట: మర్తనపేటలో పోలేరమ్మ బోనాలు తీశారు. బుధవారం బ్రహ్మంగారి కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం గ్రామస్తుల ఆధ్వర్యంలో పోలేరమ్మ బోనాలు తీశారు.

కన్నుల పండువగా కల్యాణం



గంభీరావుపేట: కొత్తపల్లిలో శ్రీరుక్మిణి సత్యభామ సమేత నూతనాపురి శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. స్వామివారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు.

తడగొండ వెంకన్న కల్యాణం

బోయినపల్లి: తడగొండ గ్రామంలో గురువారం రాత్రి మంగా పద్మావతి సమేత లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ధ్వజస్తంభం వద్ద గరుడ ముద్దలు ఎగిరేసే కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది.

కోడె ప్రాణాలు కాపాడిన గోశాల సిబ్బంది



కోడెకు సపర్యలు చేస్తున్న రాజన్న గోశాల సిబ్బంది

వేములవాడ: పట్టణంలోని పార్వతీపురం ధర్మశాల వెనక గల వీఐపీ రోడ్డులో ప్రమాదానికి గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న గుర్తుతెలియని కోడెను అటుగా వెళ్తున్న ఆలయ సిబ్బంది గుర్తించారు. ఆలయ గోశాల అసిస్టెంట్ వెటర్నరీ సర్జన్ తరుణ్ ఆధ్వర్యంలో కోడెకు చికిత్స అందించి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. భక్తులు కోడె మొక్కు రూపంలో స్వామివారికి సమర్పించడానికి పాలు మరిచిన కోడెలు, అంగవైకల్యం లేని కోడెలు, ఆరోగ్యంగా ఉండే కోడెలను మాత్రమే సమర్పించాలని ఆలయ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

చిడతల రామాయణం ప్రదర్శన



ఇల్లంతకుంట: సోమరంపేట గ్రామ చిడతల రామాయణం బృందం గురువారం కరీంనగర్‌లోని కళాభారతిలో ప్రదర్శన ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ ప్రపంచ రికార్డుకు చిడతల భజన ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. 15 మంది కళాకారులు ప్రదర్శన ఇచ్చారు.

అష్టోత్తర శతనామావళి పఠనం



సిరిసిల్లటౌన్: చిన్మయ మిషన్ వ్యవస్థాపకులు స్వామి చిన్మయానంద మహారాజ్ జయంతి సందర్భంగా స్థానిక బీవైనగర్ హనుమాన్ మందిర్‌లో గురువారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. చిన్మయ మిషన్ సిరిసిల్ల సెంటర్ అధ్యక్షులు సజ్జనం శ్రీనివాస్‌స్వామి చిన్మయానంద చిత్రపటానికి పూల మాల వేసి పూజ చేశారు. భక్తులు అష్టోత్తర శతనామావళి పఠనం చేశారు.